క్లుప్తంగా

జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉపద్రష్ట


విజయాదిత్య శర్మ

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన ఉపద్రష్ట విజయాదిత్య శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శనం దుర్గబాబు సంయుక్తంగా విడుదల చేసిన నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ నియామక పత్రాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ చేతుల మీదుగా విజయాదిత్య శర్మకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాంగ కర్త ఉపద్రష్ట నాగాదిత్య, జిల్లా ఆపస్తంబ పురోహిత పరిషత్ ప్రతినిధులు గొర్తి సాయి, ఆకొండి పవన్, ఆకెళ్ల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో గ్రామ సభ


విలసవిల్లిలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ ఊర్మిళాదేవి గ్రామ సభ నిర్వహించి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు తాతాజీ రాజీనామా

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కల్వకొలను తాతాజీ ఆ పార్టీకి, ఏపీసీసీ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. ప్రస్తుతం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్‌గా తాతాజీ పనిచేస్తున్నారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబుకు పంపించారు.

ఆలయానికి స్టూల్స్ బహూకరణ


ఆలయానికి స్టూల్స్ బహూకరిస్తున్న భక్తులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయానికి ముమ్మిడివరం గ్రామానికి చెందిన దేవత వీరవెంకట సత్యనారాయణ, సాయినాథ దంపతులు 25 స్టూల్స్ బహూకరించారు. రోజూ స్వామివారి కల్యాణానికి విచ్చేస్తున్న భక్తులు కూర్చునేందుకు వాటిని అందించినట్టు దాత తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, గోకవరపు పెదబాబు, వెంకట్రాజు తదితరులున్నారు. దాతను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్

యానాం: పుదుచ్చేరిలో ప్రప్రథమంగా ఎకోల్ యాంజిల్లోయిస్ ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ ద్వారా పాఠాలు బోధించారు. రెండో తరగతి విద్యార్థులకు వివిధ రకాల పెంపుడు జంతువులు, మృగాలు తదితర వాటిని ఏఐ టెక్నాలజీ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిజమైన అడవిలో తాము ఉన్నట్లు, జంతువులను తాము తాకుతున్నామనే కొత్త భావనను విద్యార్థులు పొందారని ఉపాధ్యాయులు తెలిపారు.

ఎన్నికలు నిర్వహించకుండా చోద్యం చూస్తున్నారు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ మున్సిపాలిటీలు, కమ్యూన్ పంచాయతీలు తదితర స్థానిక సంస్థలకు ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుండా సీఎం రంగసామి చోద్యం చూస్తున్నారని మాజీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. బుధవారం ఇందిరా ఫెలోషిప్ ఆఫ్ శక్తి అభియాన్ కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది మహిళలు స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అయితే పుదుచ్చేరి వ్యాప్తంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు వైతిలింగం మాట్లాడుతూ ఎన్నికలు జరిగితే గతేడాది ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం మహిళలకు 10 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు.

క్లాప్ మిత్రలకు సత్కారం

అయినవిల్లి: గాంధీ జయంతి సందర్భంగా వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు అధ్యక్షతన బుధవారం వీరవల్లిపాలెంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ క్లాప్ మిత్రలకు శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ నగదును బహుమతిగా వారికి ఇచ్చారు.

సమస్యల వలయం.. చొల్లంగిపేట గురుకులం

- పాములు, దోమలతో సహవాసం
- పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం
- పలుచోట్ల కూలిన రిటైనింగ్ వాల్



చొల్లంగిపేట గురుకుల పాఠశాల

తాళ్లరేవు: నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ఉచిత వసతి, ఉన్నత విద్యను అందించేందుకు ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చుచేసి ప్రైవేటు పాఠశాలల్లో చదివించలేని నిరుపేదలు తమ పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేరుస్తున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాళ్లరేవు మండల పరిధిలోని చొల్లంగిపేటలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల సమస్యల వలయంలో ఉంది. పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో పాటు, సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో నిత్యం అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షం పడినప్పుడల్లా నీరు నిలిచిపోతుంది. ముంపు నీరు బయటకుపోయే మార్గం లేకపోవడంతో నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థినులకు మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. పాములు, జెర్రిలు తదితర కీటకాలు వస్తుండడంతో బాలికలు భయాందోళనకు గురవుతున్నారు. తాగునీరు సైతం పూర్తిస్థాయిలో ఉండడం లేదని పలువురు విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

విశాలమైన ప్రాంగణంలో ఉన్న చొల్లంగి గురుకుల పాఠశాలలో కావాల్సినంత ఆటస్థలం ఉన్నా పిచ్చి మొక్కలు, తుప్పలతో అధ్వానంగా తయారైంది. దీంతో విద్యార్థినులకు ఆటలాడుకునే అవకాశం లేక నిరుపయోగంగా మారింది. మరోవైపు గురుకులం చుట్టూ ఉండే రక్షణగోడ పలుచోట్ల కూలిపోవడంతో బాలికలకు రక్షణ కరవైంది. కూలిన ప్రాంతం నుంచి బయటి వ్యక్తులు లోపలకు ప్రవేశించి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గురుకులంలో ఉండే బాలికలు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గురుకులంలో తమ సమస్యలను పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


పిచ్చి మొక్కలు, తుప్పలతో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం


గురుకుల పాఠశాలలో పలు చోట్ల కూలిపోయిన రక్షణ గోడ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయకుమారి బుధవారం తెలిపారు. గత నెల 26వ తేదీన కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి అండర్–17 విభాగంలో అప్పారి కుందన సత్య సరస్వతి, తిరుకోటి అక్షిత, చొల్లంగి జ్యోషికా సుధ, అండర్–14 విభాగంలో రేఖాడి నవ్యశ్రీ, ప్రసాది తనూజలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అప్పారి సతీష్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీదేవి, వి.నాగదుర్గ తదితరులు అభినందించారు.

పారిశుధ్యాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలి


స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి


కొమరగిరిపట్నంలో క్లాప్ మిత్రలను సత్కరించిన సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీ మాథూర్, ఎమ్మెల్యే దాట్ల తదితరులు

అమలాపురం టౌన్: పారిశుధ్యాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించినప్పుడే పరసరాల పరిశుభ్రత, స్వచ్ఛత సాధ్యమవుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. స్థానిక 27వ వార్డు మార్కెట్ ఏరియాలో బుధవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు పారిశుధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రతి పౌరుడు మరీ ముఖ్యంగా ప్రతి వ్యాపారి తడి, పొడి చెత్తల వర్గీకరణ కోసం రెండు టిన్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ పారిశుధ్య కార్మికులను ధ్రువీకరణ పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, వార్డు కౌన్సిలర్లు బండారు గోవిందు, దొంగ చిన్నా, గోపి రమేష్, నక్కా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

అల్లవరం: స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమంలో భాగంగా పలు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. అల్లవరంలో సర్పంచ్ బొమ్మి బాలవేణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న క్లాప్ మిత్రాలను ఘనంగా సత్కరించారు.

పంచాయతీ కార్మికులకు సత్కారం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామపంచాయతీలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పారిశుధ్య కార్మికులను బుధవారం సత్కరించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, చొల్లంగి శ్రీను, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు పాల్గొన్నారు. ఇమ్మిడివరప్పాడులో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని సర్పంచ్ రేలంగి దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

స్వచ్ఛతాహి సేవ ముగింపు వేడుకలు

తాళ్లరేవు: స్వచ్ఛతాహి సేవ ముగింపు వేడుకలను చొల్లంగిపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజులు హాజరయ్యారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమాలలో ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ మట్టపర్తి అనుపమ, తహసీల్దార్ పితాని త్రినాథ్, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

వేతనాల కోసం రోడ్డెక్కిన ఉద్యోగులు


అమలాపురంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సర్వ శిక్ష ఉద్యోగులు

అమలాపురం టౌన్: బకాయి వేతనాల కోసం సర్వశిక్ష ఉద్యోగులు అమలాపురంలో రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని విగ్రహానికి తమ వెతలను విన్నవించుకుని వినతి పత్రం అందజేశారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రెగ్యులర్ చేయాలంటూ డిమాండ్ చేశారు. అమలాపురం పర్యటనకు వచ్చిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతి పత్రం అందజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు గుంటూరు పండు, నూకపెయ్యి గంగాధరరావు, బత్తుల శ్రీనివాస్, హిమబిందు, విత్తనాల వెంకటరమణ, గూటం నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి


సదస్సులో పాల్గొన్న ఎంపీ హరీష్ మాధూర్, ఎమ్మెల్యేలు

అమలాపురం రూరల్: కోనసీమ రైస్‌మిల్లర్ల సమస్యలను పరిష్కరిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ భవిష్యత్తు ప్రణాళిక, టెక్నికల్ అప్‌డేటేషన్ కోసం నిపుణుల అభిప్రాయం తీసుకున్నారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సదస్సులో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, దాట్ల బుచ్చిబాబు, గిడ్డి సత్యనారాయణ, వేగుళ్ల జోగేశ్వరరావు, దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, జెడ్పీ మాజీ చైర్మన్ నమన రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు తదితరరులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం, బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూస్తామన్నారు. సదస్సులో ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణుమూర్తి పాల్గొన్నారు.

కళాకారులను అన్ని విధాలా ప్రోత్సహించాలి


పలివెలలో కళాకారుల సంఘ భవనం ఆధునీకరణపై చర్చిస్తున్న రాజ్‌కుమార్

కొత్తపేట: కళారూపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ప్రోత్సహించడం ద్వారా కళాకారుల జీవన స్థితిగతులను మెరుగుపర్చాలని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ కోరారు. కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం బుధవారం సాయంత్రం మండలంలోని పలివెల కళాకారుల సంఘ భవనంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొమారిపాటి ఏసు వెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షుడు, శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుర్తింపు కార్డులు, మంజూరు కావలసిన సంక్షేమ పథకాలు, కళాకారుల పింఛన్లు, పేద కళాకళాకారులకు ఇళ్ల మంజూరు, సంఘ బలోపేతం, సంఘ భవనం ఆధునీకరణ తదితర అంశాలపై చర్చించారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ కళాకారులకు సంబంధించి ప్రభుత్వ సాంస్కృతిక శాఖ పరిధిలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయని, వాటిని అర్హులైన వారికి మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. అలాగే శాఖ ద్వారా కళారూపాల ప్రదర్శనలు ఇచ్చి ప్రోత్సహించాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. సంఘం ద్వారా పేద కళాకారులకు, వివిధ కారణాలతో మృతి చెందిన కళాకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంపై అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులను అభినందించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలి

పి.గన్నవరం: నేటి ఆధునిక విద్యా విధానంలో విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు అన్నారు. స్థానిక గ్రేస్ కళాశాలల ప్రాంగణంలో బుధవారం జరిగిన ఫేర్‌వెల్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కష్టపడి ఇష్టంతో చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఇటీవల వచ్చిన సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. కళాశాల వ్యవస్థాపకులు ఎస్ఆర్‌జే ప్రసాద్, శిరీష దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ఎండీ నల్లి మనీషా, కందాలపాలెం ఎన్‌జేఎం మినిస్ట్రీస్ అధినేత జి.దానియేలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మామిడికుదురు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నగరం గ్రామానికి చెందిన వానరాశి నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం షాపులు సెలవు కావడంతో మంగళవారం మద్యం కొనుగోలు చేసి తన ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తుండగా అతడ్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.9,780 విలువ చేసే 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం

- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- వాడవాడలా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు


ముమ్మిడివరంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు


అమలాపురంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ముమ్మిడివరం: ప్రతిఒక్కరూ జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గాంధీజీ జయంతి వేడుకల సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక లంకతల్లమ్మ గుడివద్ద గల గాంధీజీ నిలువెత్తు విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, పెన్మత్స చిట్టిరాజు, మండల కన్వీనర్ జగతా పద్మనాభం, బొంతు సత్యశ్రీనివాస్, కోలా బాబ్జి, రాయపురెడ్డి జానకిరామయ్య, తిరుకోటి శాంతిసుధ, నాతికుమార్, కమిడి ప్రవీణ్, మట్టపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం, గడియారం స్తంభం సెంటర్, గాంధీనగర్‌ల వద్ద గల మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాలు జరిగాయి.

అల్లవరం: జాతిపిత, మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక ఆర్యవైశ్య సత్రం వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులలర్పించారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, మోర్త భైరవమూర్తి, గంజా సూరిబాబు, జక్కల ప్రసాద్, బోయిడి వేణుగోపాల్, సూరంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బొటానికల్ గార్డెన్స్‌లో నిలువెత్తు గాంధీ కాంస్య విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పాతమార్కెట్ ఎదురుగా ఉన్న గాంధీ పార్క్‌లో గాంధీ విగ్రహానికి, ఫెర్రీరహదారిలో గాంధీ విగ్రహానికి సైతం పూలమాలలు వేశారు.

ఐ.పోలవరం: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం వీధి సురేష్‌బాబు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి


తాళ్లరేవులో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు


బొటానికల్ గార్డెన్‌లో మహాత్ముని విగ్రహం వద్ద నివాళులర్పించిన ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

పుష్కరఘాట్ పవిత్రతను కాపాడాలి


తొండవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

అంబాజీపేట: మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయం మారిన పుష్కరఘాట్‌లో తక్షణమే చర్యలు తీసుకుని ఘాట్ పవిత్రతను గ్రామస్తులంతా కాపాడవల్సిన అవసరం ఉందని అమలాపురం రోహిణి ఆస్పత్రి వైద్యుడు వీఎస్ఎస్ మూర్తి అన్నారు. తొండవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు అధ్యక్షతన గ్రామసభను బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో చెత్త, చెదారం వేయడం వల్ల వచ్చే రోగాలను వివరించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కర్ ఘాట్ పవిత్రను కాపాడాలంటూ విద్యార్థులు, గ్రామస్తులు ప్లకార్డులు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం పీవీ కేశవాచార్యులు, ఎస్ఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.